క్లుప్తంగా

గృహాలను సందర్శించాలి

బేస్తవారిపేట: ఆశాలు హౌస్‌హోల్డ్ సర్వే చేయాలని జిల్లా ఆశా నోడల్ అధికారిణి పీ రాజేశ్వరీ, డీఎల్‌టీబీఓ శ్రీవాణి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీలో టీబీ పరీక్షల ల్యాబ్, రికార్డులను పరిశీలించారు. టీబీ ముక్త్ అభియాన్, బ్రెస్ట్ ఫీడింగ్, ఈ-ఆశాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి టీ కావ్య, సీహెచ్‌ఓ తులసి ప్రసాదరావు పాల్గొన్నారు.

బీమా గడువు పొడిగింపు

బేస్తవారిపేట: ప్రధానమంత్రి ఫసల్‌బీమాను ఈనెల 14వ తేదీ వరకు పొడిగించినట్లు వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్ అన్నారు. మండలంలోని పెంచికలపాడు, చెట్టిచర్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మీసేవా కేంద్రాల్లో పంటలు సాగు చేసిన రైతులు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని కోరారు. విత్తనోత్పత్తిలో మొక్కజొన్న పంటను సాగు చేసే రైతులు కంపెనీ ప్రతినిధుల నుంచి అగ్రిమెంట్ తీసుకుని సాగు చేయాలని అన్నారు. విత్తనాలు, ఎరువులు-పురుగుమందుల దుకాణాల్లో రశీదు తీసుకుని కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది శ్రీలక్ష్మీ, ప్రవీణ్‌కుమార్, ఏఈఓ ఆదిగణేష్ పాల్గొన్నారు.

పొదిలి రూరల్: ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం తుది గడువు ఈ నెల 14వ తేదీ వరకు పొడిగించినట్లు ఏవో దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం పొదిలి మండలం మల్లవరం, అక్కచెరువు గ్రామాల్లో రైతులకు దీనిపై అవగహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలకు తప్పని సరిగా రైతులు ఈ-క్రాప్ చేయించుకోవాలన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు ఇన్సూరెన్స్ నమోదు చేయించుకోవాలని సూచించారు. కౌలు రైతులు తప్పనిసరిగా సీసీఆర్‌సీ కార్డులు పొందాలని కోరారు. ఉద్యానవన హెచ్‌ఈఓ ధనలక్ష్మి, గురుబ్రహ్మం, రైతులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

గిద్దలూరు రూరల్: స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సు అమలు చేస్తే దాని వల్ల నష్టపోయే ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య కోరారు. పట్టణంలోని నరవ రోడ్డులో ఆటో స్టాండ్ ఆవరణలో మంగళవారం ఆటో వర్కర్ల యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం దెబ్బతినడం, నిరుద్యోగ వ్యవస్థ పెరగడం వల్ల ఎక్కువ మంది యువత ఆటో నడుపుకుంటు జీవనం కొనసాగిస్తున్నారన్నారు. అటువంటి ఆటో కార్మికులకు ఈ పథకం నష్టం కలిగిస్తుందన్నారు. వాహన మిత్ర పథకం ద్వారా రూ.15 వేలు ఇవ్వాలన్నారు. ఆదుకునేందుకు ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులను అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఆటో వర్కర్ల యూనియన్ నాయకులు జి.రాజు, ఉస్మాన్, బాలగురవయ్య, విజయవర్ధన్, రంగస్వామి, చాంద్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఉద్యోగులతో మాట్లాడుతున్న చెంచిరెడ్డి

మార్కాపురం టౌన్: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ మార్కాపురం తాలూకా అధ్యక్షుడు కె.చెంచిరెడ్డి డిమాండ్ చేశారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ పిలుపు మేరకు ఆర్ అండ్‌బీ కార్యాలయంలో రండి..టీ తాగుతూ మాట్లాడుకుందాం.. అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు రావాల్సిన పీఆర్‌సీ, డీఏ తదితర ఆర్థిక ప్రయోజనాల గురించి చర్చించారు. అలాగే వివిధ శాఖల్లో జరిగిన బదిలీల గురించి మాట్లాడుకున్నారు. కార్యక్రమంలో మార్కాపురం తాలూకా సెక్రటరీ బి.వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, ట్రెజరర్ బుడే సాహెబ్, సంఘ నాయకులు కోమలి, శేఖర్, కార్యవర్గ సభ్యులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓబీసీ జాతీయ మహాసభను జయప్రదం చేయాలి



మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీసీ నాయకులు

గిద్దలూరు రూరల్: గోవాలో ఈ నెల 7వ తేదీ ఓబీసీ సంక్షేమ సంఘ జాతీయ మహా సభను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. గోవాలో డా.శ్యామ్ ప్రసాద్‌ముఖర్జీ స్టేడియంలో జరగబోయే మహాసభకు వెళుతూ మార్గంమధ్యలో గిద్దలూరు పట్టణంలోని స్ప్రింగ్ బోర్డు స్కూల్ ఆవరణలో మంగళవారం ఆయన మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐకమత్యంగా పోరాడాల్సిన సమయం వచ్చిందన్నారు. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీల డిమాండ్ల సాధన కోసం అందరం కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, బాదుగున్నల శ్రీను, జాడి శ్వేత, కొల్లూరు హనుమంతరావు, వేముల కృష్ణ, వెంకటరావు, పూర్ణచంద్రరావు, పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ కుటిలత్వం ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కేపీ నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్: బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ నినాదంతో కూటమి ప్రభుత్వ కుటిలత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై ఉందని గిద్దలూరు ఇన్‌చార్జ్ కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు చెందిన నాయకులతో మంగళవారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ప్రజల్లో వైఎస్సార్ సీపీపై అంతులేని అభిమానం ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వారు చేసిన దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను ఎప్పటికీ విస్మరించమన్నారు. వారికి అండగా ఉంటామని చెప్పారు. అబద్ధపు హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వ విధివిధానాలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. జగనన్న పాలనలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందారని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కడప లక్ష్మి, మాజీ ఎంపీపీలు కడప వంశీధరరెడ్డి, పందరబోయిన శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిని ఓబులరావు, మానం బాలిరెడ్డి, బొర్రా కృష్ణారెడ్డి, ఈదుల పాండురంగారెడ్డి, ఎగ్గన్నపల్లె నాగేశ్వరరావు యాదవ్, శంకర్‌రెడ్డి, శివకోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైపీ రంగయ్య యాదవ్

గిద్దలూరు రూరల్: ఉద్యోగుల బకాయిలు ప్రభుత్వం విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం గిద్దలూరు తాలూకా అధ్యక్షుడు వై.పి.రంగయ్యయాదవ్ అన్నారు. పట్టణంలోని పాత తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల హక్కుల సాధనే లక్ష్యంగా బకాయిలు రూ.30 వేల కోట్లను, పీఆర్‌సీ, ఐఆర్, డీఏ, సరండర్ లీవులు వంటి ప్రధాన డిమాండ్లను సాధించుకునేందుకు ప్రయత్నించాలన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలన్నారు. గత ప్రభుత్వంలో ఏర్పడిన గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థలో ప్రొహిబిషన్ కాలంలో రూ.15 వేలు జీతం ఇచ్చిందని కానీ రెండు సంవత్సరాల తొమ్మిది నెలలకు రెగ్యులర్ చేసి 9 నెలల బకాయిలు ఇంత వరకు ఇవ్వలేదని ఇలాగే సచివాలయంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు విజయభాస్కర్ రెడ్డి, వెంకటరామయ్య, నారాయణ, భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత హిమశేఖర్‌రెడ్డికి కేపీ పరామర్శ



హిమశేఖర్‌రెడ్డిని పరామర్శిస్తున్న కేపీ నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని వైఎస్సార్ సీపీ నాయకుడు, ప్రముఖ న్యాయవాది కాకునూరి హిమశేఖరరెడ్డికి ప్రమాదవశాత్తు కాలు విరగడంతో ఆయనను పరామర్శించేందుకు గిద్దలూరు ఇన్‌చార్జ్ కేపీ నాగార్జునరెడ్డి మంగళవారం ఆయన నివాస గృహానికి వెళ్లారు. ఈ సందర్భంగా హిమశేఖరరెడ్డి ఆరోగ్య పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మానం బాలిరెడ్డి, బొర్రా కృష్ణారెడ్డి, ఎగ్గన్నపల్లె నాగేశ్వరరావు యాదవ్ తదితరులు ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం తగదు



ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు

మార్కాపురం టౌన్: రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం తగదని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ రమణ అన్నారు. మంగళవారం జర్నలిస్టు డిమాండ్ డే సందర్భంగా ప్రెస్‌క్లబ్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ కార్యాలయ ఓ రవీంద్రారెడ్డికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులకు నూతన అక్రిడేషన్లు వెంటనే మంజూరు చేయాలని, అలాగే ప్రమాద బీమా పాలసీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్రిడేషన్ల మంజూరులో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు కావస్తున్నా వాయిదాలు వేయడం బాధాకరమన్నారు. పాత్రికేయ వృత్తిలో అనేక సేవలు అందించి సమాజాభివృద్ధికి పాటుపడి పదవీ విరమణ చేసిన జర్నలిస్టులకు బీహార్ రాష్ట్రం తరహాలో రాష్ట్ర ప్రభుత్వం 20 వేల పింఛన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాత్రికేయులు డి.జగన్నాథరెడ్డి, మహబూబ్ సుభానీ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, కోశాధికారి డి.బాబీ, జిల్లా కమిటీ సభ్యులు రమేష్, సుబ్రహ్మణ్యం, సుబ్బారావు, రాజు, బషీరు, మల్లికార్జునరెడ్డి, సురేష్, కరీం, షౌకత్‌తో పాటు పలువురు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి పొంగళ్లు



బోనాలతో అమ్మవారి ఆలయానికి వస్తున్న భక్తులు

కొనకనమిట్ల: మండలంలోని కాట్రగుంట పంచాయతీ పేరారెడ్డిపల్లిలో మంగళవారం సాయంత్రం పోలేరమ్మ తల్లికి గ్రామస్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. పోలేరమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట వార్షికోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారికి ఉత్సవం నిర్వహించారు. పోలేరమ్మా దీవించమ్మా అంటూ గ్రామ ప్రజలు బోనాలతో పెద్ద ఎత్తున అమ్మవారి ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకొని అమ్మవారిని దర్శించుకొని పునీతులయ్యారు. ముందుగా గ్రామంలోని గ్రామ దేవతలకు పూజలు చేసి మేళతాళాలతో, బోనాలతో ఉత్సవం నిర్వహించారు. వేద పండితులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకిరంచి పూజా కార్యక్రమాలు నిర్వహించి సహస్తనామ పూజలు జరిపించారు. ఉత్సవం సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

పొదిలి విద్యార్థినికి గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న అనూష

పొదిలి రూరల్: పొదిలి విద్యార్థిని ఫుడ్ అండ్ న్యూట్రిషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించింది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఇటీవల 55వ స్నాతకోత్సవం జరిగింది. స్నాతకోత్సవంలో పొదిలి పట్టణానికి చెందిన చెరుకూరి అనూష (ఎంఎస్సీ) ఫుడ్ అండ్ న్యూట్రిషన్‌లో స్పెషలైజేషన్ చేసి యూనివర్సిటీలో ఉత్తమ ర్యాంక్ సాధించింది. టాప్ ర్యాంక్ సాధించినందుకు స్నాతకోత్సవంలో తెలంగాణ గవర్నర్, వ్యవసాయ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ విష్ణుదేవ వర్మ, ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రిసేర్చ్ డైరెక్టర్ డాక్టర్ మంగీలాల్‌జెట్ చేతుల మీదగా గోల్డ్‌మెడల్ అందుకుంది. అనూషను ఆమె తల్లిదండ్రులు సీహెచ్ రవికుమార్, అబీదాబేగం, బాదుల్లా, బంధువులు అభినందించారు. ప్రస్తుతం అనూష పంజాబ్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తోంది.

సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు ఐక్యంగా పోరాడాలి



టీ తాగుతూ మాట్లాడుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులు

కంభం: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కంభం తాలూకా అధ్యక్షుడు ముక్కు ప్రసాద్‌రెడ్డి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాలులో మంగళవారం 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొని తమ సమస్యలపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ కి ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు సుమారు రూ.30 వేల కోట్లకు చేరుకున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న ఉద్యోగ యూనియన్లు కులాల వారీగా, రాజకీయ పార్టీల వారీగా, కేడర్స్ వారీగా విడిపోయి ఉద్యోగుల ఐక్యత దెబ్బతీసేలా ఉందన్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అన్నీ ఉద్యోగ సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి అందరితో సంఘటితమై ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను పొందేందుకు ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రంగస్వామిరెడ్డి, కృపాకర్, వెంకటేశ్వర్లు, రవీంద్రా, ఉద్యోగులు రమేష్ రెడ్డి, కిశోర్, నాగలక్ష్మి, రవి, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన ఎల్లమ్మ తల్లి ప్రతిష్ట మహోత్సవాలు



భక్తులను ఆశీర్వదిస్తున్న స్వరూపనందగిరి స్వామి

కొనకనమిట్ల: మండలంలోని ఇరసలగుండంలో నూతనంగా నిర్మించిన శ్రీనాగారపు ఎల్లమ్మ తల్లి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు మేళతాళాలు, భక్తుల కోలాహలం నడుమ మంగళవారంతో ముగిశాయి. వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాలతో అమ్మవారికి హోమాలు, అభిషేకాలు జరిపించారు. అమ్మవారి ప్రతిష్ట సందర్భంగా గ్రామంలో బంధుమిత్రుల రాకతో సందడి నెలకొంది. ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు ఆలయ ధర్మకర్త గోపిరెడ్డి ఆదెమ్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మూడు రోజుల పాటు గ్రామంలో అన్న సంతర్పన చేశారు. తిరుపతిలోని శ్రీనివాస మంగాపురంలో గల వశిష్టాశమ లలిత పీఠ వ్యవస్థాపక పీఠాధిపతి స్వరూపనందగిరిస్వామి ఎల్లమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని విశేష పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు ఇచ్చి ఆశీర్వచనాలు అందజేశారు.

పత్తి పైరుపై గడ్డిమందు స్ప్రే

అర్ధవీడు: మండలంలోని గన్నెపల్లి గ్రామంలో పత్తి పైరుకు గడ్డి మందు స్ప్రే చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన చంద్రయ్య, లక్ష్మీ ఈశ్వరి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారు సాగు చేస్తున్న పత్తిపైరుపై గుర్తుతెలియని వ్యక్తులు గడ్డిమందు చల్లడంతో పైరు నష్టపోయామని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అర్ధవీడు ఎస్సై బి.మధుసూదన్‌యాదవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

బేస్తవారిపేట: మండలంలోని ఎంపీ చెరువులో తల్లిపాల వారోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాలెమ్మ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించడంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాలు ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బీ భారతి, ఎం సుకన్య, మహబున్ని పాల్గొన్నారు.

అర్ధవీడు: బిడ్డకు తల్లి అందించే అమృతం ముర్రుపాలు అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డీ రంజాబీ పేర్కొన్నారు. మంగళవారం అర్ధవీడు సెక్టారులోని 6వ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తలు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 7వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలు నిర్వహించి సూచించారు.

తర్లుపాడు: నవజాత శిశువు ఆరోగ్యంగా పెరిగేందుకు తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయని సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. మండల కేంద్రం తర్లుపాడు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు బాలింతలు, గర్భిణులకు తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. ప్రకృతి సిద్ధంగా తయారయ్యే తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయని, తల్లిపాలలో వివిధ రకాల పోషకాలు ఉంటాయని, అవి బిడ్డ ఎదుగుదలకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. పోతపాలతో అనారోగ్య సమస్యలు వస్తాయని వివరించారు. బిడ్డపుట్టిన గంటలోపే పాలిచ్చేలా చేయడమే తల్లిపాల వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి ఆటంకాలు తొలగించాలి

మార్కాపురం: పెద్దారవీడు మండలం సానికవరం సత్రాల సెంటర్‌లో పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి అడ్డంగా జరుగుతున్న బస్‌షెల్టర్ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని కోరుతూ మంగళవారం స్థానిక సీపీఎం నాయకులు దగ్గుబాటి సోమయ్య, స్మారక కేంద్రం అధ్యక్షుడు దొడ్డా సుబ్బారెడ్డిలు నేషనల్ హైవే అథారిటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్‌కు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. అనేక సంవత్సరాలుగా సానికవరంలో పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం పేరుతో సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, అయితే హైవే రోడ్డుకు పక్కన ఉందని కాంట్రాక్టర్ బస్‌షెల్టర్ నిర్మాణం చేపట్టారని తెలిపారు. ఈ నిర్మాణం జరిగితే కేంద్రంలోకి ఎవరూ రాలేని పరిస్థితి ఉంటుందని తెలిపారు. వెంటనే నిర్మాణాన్ని ఆపివేయాలని కోరారు.

ఎంఈఓ-1గా మధుసూదన్‌రెడ్డి

బేస్తవారిపేట: మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ-1గా సరెడ్ల మధుసూదన్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బేస్తవారిపేట జెడ్పీ బాలికల హైస్కూల్ హెచ్‌ఎంగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న మధుసూదన్‌రెడ్డి ఎంఈఓగా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ-1 అబ్దుల్ సత్తార్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో తర్లుపాడు నేతలకు పదవులు

మార్కాపురం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ తర్లుపాడు మండల అంగన్‌వాడీ, మండల బీసీ విభాగం, మండల సాంస్కృతిక విభాగం, క్రిస్టియన్ మైనార్టీ విభాగం, దివ్యాంగుల విభాగం, మహిళా విభాగం, మైనార్టీ సెల్ కమిటీ, పంచాయితీరాజ్ వింగ్, మండల పబ్లిసిటీ వింగ్, ఆర్‌టీఐ వింగ్, రైతు విభాగం, ఎస్సీ సెల్ కమిటీ, సోషల్ మీడియా వింగ్, ఎస్‌టీ సెల్ కమిటీ, స్టూడెంట్ వింగ్ కమిటీ, వాణిజ్య విభాగం, వలంటీర్స్ వింగ్, యూత్ వింగ్, వైఎస్సార్ పీయూసీ కమిటీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అంగన్‌వాడీ విభాగ కమిటీ ఉపాధ్యక్షులుగా జి.ఆమని, వి.నాగమణి, జనరల్ సెక్రటరీలుగా ఎస్‌కే కరీస్మా, రాచకొండ రమణ, ఎం.చిన్న వెంకట కొండమ్మలను నియమించారు. మండల బీసీ విభాగ కమిటీ అధ్యక్షులుగా తిరుమల అంజయ్య, చింతం వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీలుగా పి.వెంకట కాశయ్య, పి.పెద్దిరాజు, తూంపాటి ఈశ్వరయ్యలను నియమించారు. సాంస్కృతిక విభాగ కమిటీ అధ్యక్షులుగా మిట్నాల శివ, కొణతం సుబ్బారెడ్డి, జనరల్ సెక్రటరీలుగా పులుకూరి లక్ష్మయ్య, తానుబుద్ధి అశోక్‌రెడ్డి, ఏరువ ఈశ్వర్ రెడ్డిలను నియమించారు. క్రిస్టియన్ మైనార్టీ విభాగ కమిటీ ఉపాధ్యక్షులుగా ఎస్.అహరోన్ రావు, కె.విల్సన్, జనరల్ సెక్రటరీలుగా పల్లె పోగు మోషే, జి. ఇర్మియా, జి.రవితేజలను నియమించారు. దివ్యాంగుల విభాగం కమిటీ అధ్యక్షులుగా ఎం.హనుమంతారెడ్డి, మంచా అజయ్, జనరల్ సెక్రటరీలుగా పి.మరియదాసు, జి.పిచ్చయ్య, బత్తుల ఆంజనేయులు, మండల మహిళా విభాగం కమిటీ ఉపాధ్యక్షులుగా నడికట్టు రమాదేవి, గాయం వసంత, జనరల్ సెక్రటరీలుగా ఎం.లక్ష్మి, ఎ.సుబ్బమ్మ, ఎం.చెన్నమ్మ, మైనార్టీ విభాగం కమిటీ ఉపాధ్యక్షులుగా ఎస్‌కే దిలావర్ హుస్సేన్, నాయబ్ రసూల్, జనరల్ సెక్రటరీలుగా ఎస్‌కే ఆలీ సాహెబ్, అబ్దుల్ రహీం, ఎస్‌కే దస్తగిరి, పంచాయితీరాజ్ వింగ్ ఉపాధ్యక్షులుగా సానికొమ్ము బాల వెంకటేశ్వర్లు, నూనె కోటిరెడ్డి, జనరల్ సెక్రటరీలుగా ఉడుముల కాశిరెడ్డి, బి.నాగేశ్వరరావు, తాటికొండ శేఖర్, పబ్లిసిటీ వింగ్ కమిటీ ఉపాధ్యక్షులుగా బండి వెంకటేశ్వరరెడ్డి, ఈ.నారాయణ, జనరల్ సెక్రటరీలుగా సయ్యద్ రఫీ, ఎం.రాజు, జి.ఎర్రారెడ్డి, ఆర్‌టీఐ విభాగ కమిటీ ఉపాధ్యక్షులుగా పి.రమణారెడ్డి, బి.ఇంద్రసేనారెడ్డి, జనరల్ సెక్రటరీలుగా పుచ్చకాయల గురవయ్య, తాడికొండ వెంకటేశ్వర్లు, దూదేకుల మహ్మద్‌లను నియమించారు. రైతు విభాగం కమిటీ ఉపాధ్యక్షులుగా జి.నరసింహులు, ఎం.వెంకటేశ్వరరెడ్డి, జనరల్ సెక్రటరీలుగా టి.అంజయ్య, ఉడుముల శ్రీనివాసరెడ్డి, రావి కాశిరెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షునిగా జమ్ముల్లమూడి గురవయ్య, ఉపాధ్యక్షులుగా బత్తుల కాశయ్య, శిఖామణి, జనరల్ సెక్రటరీలుగా పి.లక్ష్మయ్య, కె. డేవిడ్, ఎం.పాపయ్యలను నియమించారు. మండల సోషల్ మీడియా కమిటీ ఉపాధ్యక్షులుగా ఈ.దాసు, నాగం గురు కృష్ణ, జనరల్ సెక్రటరీలుగా వై.రాజశేఖర్‌రెడ్డి, టి.మహేశ్వరరెడ్డి, ఉమ్మారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌టీ సెల్ ఉపాధ్యక్షులుగా ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్.నారాయణ, జనరల్ సెక్రటరీలుగా ఎస్. రాంబాబు, ఎస్. రమణమ్మ, శ్రీరాం శ్రీనివాసరావు, స్టూడెంట్ వింగ్ కమిటీ ఉపాధ్యక్షునిగా వి.వెంకట గురవయ్య, మేకల ఆదినారాయణ రెడ్డి, జనరల్ సెక్రటరీలుగా సీహెచ్ నవీన్‌కుమార్‌రెడ్డి, జీపీ వెంకటేశ్వర్లు, దొండేటి నరేందర్‌రెడ్డిలను నియమించారు. మండల వాణిజ్య విభాగం కమిటీ ఉపాధ్యక్షులుగా కుందురు కృష్ణారెడ్డి, తడికమళ్ల ప్రసాద్, జనరల్ సెక్రటరీలుగా రావూరి వెంకటేశ్వర్లు, గొలమారి రామిరెడ్డి, గాయం శ్రీనివాసరెడ్డి, వలంటీర్స్ వింగ్ కమిటీ ఉపాధ్యక్షునిగా జి.రామకృష్ణారెడ్డి, బి.యోగి, జనరల్ సెక్రటరీలుగా సీహెచ్ మీరావలి, నవీన్‌రెడ్డి, టి.హర్షవర్ధన్‌రెడ్డిలను నియమించారు. మండల యూత్ వింగ్ కమిటీ ఉపాధ్యక్షులుగా గాయం చెంచిరెడ్డి, బి.విజయకుమార్, జనరల్ సెక్రటరీలుగా టి. ఏడుకొండలు, ఎస్‌కే దస్తగిరి, ఈదర వెంకటేశ్వరరెడ్డిలను నియమించారు. వైఎస్సార్ టీయూసీ మండల ఉపాధ్యక్షులుగా తుంబేటి సుబ్బయ్య, దేవిరెడ్డి వెంకటరెడ్డి, జనరల్ సెక్రటరీగా పి.నాగేశ్వరరావు, టి.కృష్ణారెడ్డి, శ్రీరాం శ్రీనులతోపాటు సెక్రటరీలు, ఈసీ మెంబర్లను నియమించారు.

స్మార్ట్‌మీటర్లను అడ్డుకుంటాం

● పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి



ప్రదర్శనకు హాజరైన నాయకులు

మార్కాపురం: స్మార్ట్ మీటర్లను అడ్డుకుంటామని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ, రైతు సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, రైతు సంఘ నాయకుడు బాల నాగయ్య మాట్లాడుతూ పేదల జేబులకు చిల్లు పెట్టే స్మార్ట్‌మీటర్ విధానాన్ని వెనక్కు తీసుకోవాలని, లేకుంటే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అడ్డుకుంటామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆ పార్టీ నాయకులు రైతులకు, ప్రజలకు, వ్యాపారులకు నష్టం కలిగించే స్మార్ట్‌మీటర్లను పగులకొట్టండి అని.. బాదుడే..బాదుడు కార్యక్రమం సందర్భంగా పిలుపునిచ్చారన్నారు. వీరి మాటలను నమ్మిన రాష్ట్ర ప్రజలందరూ అధికారాన్ని కట్టబెట్టారని, రాగానే ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. 2023–24 సంవత్సరానికి వాడుకున్న విద్యుత్‌పై 15,485 కోట్ల రూపాయలు ప్రజలపై అధనంగా భారం మోపారన్నారు. ఐదేళ్లుగా వైఎస్సార్ ప్రభుత్వం వసూలు చేసిన విద్యుత్ చార్జీలను కూటమి ప్రభుత్వం ఒక్క సంవత్సర కాలంలోనే దాదాపుగా 27 వేల కోట్ల రూపాయలు వసూలు చేసి ప్రజలపై భారం మోపిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను గుర్తించి స్మార్ట్‌మీటర్లను బిగించవద్దని డిమాండ్ చేశారు. రైతు సంఘ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సుబ్బరాయుడు, రూబెన్, తురకా ఏడుకొండలు, ప్రసాద్, మల్లికార్జున పాల్గొన్నారు.